

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
శనివారం 13 ఏప్రిల్ 2024



నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

సుభాష్‌నగర్, ఏప్రిల్ 12: నగరంలోని తిలక్‌గార్డెన్ ఉపకేంద్ర పరిధిలోని 11 కేవీ సరస్వతినగర్, సివిల్ హాస్పిటల్ ఫీడర్‌లో, వినాయక్‌నగర్ ఉపకేంద్రంలోని ఆర్యనగర్-2 ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏడీఈ టౌన్-1 ఆర్.చంద్రశేఖర్, ఏడీఈ టౌన్-2 తోట రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని వారు కోరారు.



• ఒడ్డాపల్లిలో మొరం తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

అడ్డగోలుగా తవ్వేస్తున్నారు!

- జిల్లాలో ఇష్టారాజ్యంగా మొరం, మట్టి తవ్వకాలు
- రూ. లక్షల్లో దండుకుంటున్న అక్రమార్కులు
- అక్రమ తవ్వకాలపై నజర్ పెట్టిన పోలీసులు
- పోలీసు స్టేషన్ల వారీగా వివరాల సేకరణ

నిజామాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మట్టి, మొరం అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. దీంతో అక్రమార్కులు లక్షల రూపాయల్లో అందినకాడికి దండుకుంటున్నారు. ఏళ్లతరబడి తవ్వకాలు చేపట్టడం వల్ల విలువైన గుట్టలు మాయమవుతున్నాయి. ప్రభుత్వ భూములు బొందల గడ్డలుగా మారుతున్నాయి. ప్రభుత్వ, అటవీ, రెవెన్యూ, దేవాదాయ శాఖ భూములే కాకుండా ఇతర భూముల్లోనూ తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టలను తొలచి మట్టి, మొరం తవ్వకాలను చేపడుతున్నారు. అనుమతులు లేకుండానే సరఫరా చేస్తున్నారు. అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో పెద్ద మాఫియాగా ఏర్పడి కొద్దిమంది కనుసన్నలోనే ఈ తవ్వకాలు జరగడంతో పాటు ధరలు కూడా నిర్ణయించే స్థాయికి చేరారు. వారు నిర్ణయించిన ధరలకే మట్టి, మొరాన్ని తరలించి సరఫరా చేశారు.

ఆగని అక్రమ రవాణా

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా జిల్లాలో అక్రమ రవాణా ఆగడం లేదు. ఆయా గ్రామాల పరిధిలోని రైతులు, గ్రామస్థులు పలుమార్లు ప్రభుత్వానికి, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. కొన్ని రోజుల పాటు వాహనాలను సీజ్ చేసి వదిలివేశారు. కిందిస్థాయిలో ప్రజాప్రతినిధుల ఒత్తిడిలు ఉండటం వల్ల అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడంతో భారీ ఎత్తున మట్టి, మొరం రవాణా జరిగింది. నిజామాబాద్ రూరల్, మోపాల్, ఎడపల్లి, డిచ్‌పల్లి, మాక్లూర్ మండలాల పరిధిలో భారీ ఎత్తున ఈ తవ్వకాలు జరిగాయి. తవ్వకాల వల్ల కొన్ని గుట్టలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఆర్మూర్, నందిపేట్, జక్రాన్‌పల్లి, రుద్రూర్, బోధన్, చందూర్, మోస్రా, వర్ని మండలాల పరిధిలో కూడా ఈ తవ్వకాలు జోరుగా కొనసాగాయి. వీటితో పాటు భీంగల్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల పరిధిలో కూడా కొంత మొత్తం తవ్వకాలు జరిగాయి. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నుంచి కూడా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలను చేసి తరలించారు. వరద కాలువ వెంట తవ్వకాలను చేశారు. పెద్ద ఎత్తున మట్టి, మొరాన్ని అక్రమార్కులు కొల్లగొట్టారు.

> “ జిల్లాలో మట్టి, మొరం మాఫియా పెట్రేగిపోతోంది. అనుమతులు లేకుండానే అడ్డగోలుగా మొరం అక్రమ తవ్వకాలు చేపడుతూ ప్రకృతి సంపదను కొల్లగొడుతోంది. కొందరు అధికారులు కాసులకు కక్కుర్తిపడి అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు. దీంతో నిజామాబాద్ రూరల్, మోపాల్, ఎడపల్లి, డిచ్‌పల్లి, మాక్లూర్ మండలాలతోపాటు ఆర్మూర్, నందిపేట్, జక్రాన్‌పల్లి, భీంగల్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, రుద్రూర్, బోధన్, చందూర్, మోస్రా, వర్ని మండలాల పరిధిలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూములను బొందల గడ్డలుగా మార్చుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలిస్తూ అధిక ధరలకు విక్రయించి అందినకాడికి దండుకుంటున్నారు.

అక్రమ తవ్వకాలపై పోలీసుల నజర్..

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఈ మట్టి, మొరం అక్రమ తవ్వకాలపై నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నజర్ పెట్టారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల వారీగా వివరాలను సేకరించారు. నిజామాబాద్ నగరంతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలే కాకుండా ప్రధానంగా తవ్వకాలు చేపట్టే ప్రాంతాలపై దృష్టి పెట్టి ఈ చర్యలను చేపడుతున్నారు. ఏఏ మండలాల పరిధిలో ఎక్కడెక్కడ మట్టి, మొరం తవ్వకాలను చేస్తున్నారో ఆరా తీశారు. ఎవరెవరు తవ్వకాలకు పాల్పడుతున్నారో వివరాలను సేకరించారు. వారికి ఎవరు మద్దతు ఉందో ఆ వివరాలను కూడా తీసుకుంటూ పోలీస్ స్టేషన్ల వారీగా బైండోవర్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుల పరిధిలో వివరాలను తీసుకోవడంతో పాటు ఎక్కడికక్కడ తవ్వకాలకు చెక్ పెడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడంతో పాటు బైండోవర్ చేసేందుకు కూడా అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 150 మంది వరకు ఈ మొరం, మట్టి తవ్వకాలు చేసేవారు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ వివరాలను కమిషనర్‌కు అందించారు. మొట్టమొదటిగా నగరానికి సంబంధించి మట్టి, మొరం తవ్వకాల్లో కీలకంగా ఉన్న ఒక ప్రజాప్రతినిధి భర్తను బైండోవర్ చేశారు. మిగతా వారిని చేసేందుకు సిద్ధమవుతున్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల వారిగా చర్యలు చేపట్టడంతో పాటు వాహనాలను సీజ్ చేయడమే కాకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ శాఖే కాకుండా గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల సమన్వయంతో పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అనుమతులు మినహా మట్టి, మొరం తవ్వకాలు లేకుండా చూసేందుకు చర్యలను చేపడుతున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల వారిగా అక్రమ మైనింగ్ చేసే వారి వివరాలను తీసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. వీరందరిపై చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు. మొదట బైండోవర్ చేస్తామన్నారు. మళ్లీ మొదలు పెడితే కేసులను పెట్టడంతో పాటు ఇతర చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అక్రమంగా మట్టి, మొరం తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



• ఛాయ్‌పై చర్చ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

• ఛాయ్‌పై చర్చ కార్యక్రమంలో ఎంపీ అర్వింద్

పెద్దబజార్, ఏప్రిల్ 12: కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా.. ప్రజల ఆశీస్సులతో మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. శుక్రవారం నగరంలోని శివాజీనగర్‌లోగల ఐటీఐ ఆవరణలో వాకర్స్‌ను కలిసి, ఆర్ఆర్ చౌరస్తాలో ఛాయ్‌పై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల వేళ మరోసారి హిందువుల ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. కేవలం ఎన్నికలు ఉన్నప్పుడే కాంగ్రెస్ హిందువులపై ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి హనుమాన్ భక్తుల వద్దకు వెళ్లి రామ రాజ్య స్థాపన కోసం కాంగ్రెస్ మాట్లాడటం సంతోషకరమని అన్నారు. రాంమందిర్ నిర్మాణాన్ని కూడా స్వాగతిస్తున్నట్లు జీవన్‌రెడ్డి ప్రకటన చేయాలన్నారు. తాను ఎంపీగా గెలిచాక పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. అవినీతి లేని పాలన కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. అనంతరం ఛాయ్ చర్చలో పాల్గొన్న వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక, రాఘవేందర్, వాకర్స్ గాండ్ల గంగాధర్, అగ్గు రమేష్, బున్ని మల్లేష్, బున్ని రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఓటరుగా నమోదుకు మూడు రోజులే గడువు

- ఈనెల 15 వరకు దరఖాస్తులను స్వీకరించనున్న అధికారులు
- 25న అనుబంధ జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు

నిజామాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న జిల్లా అధికారులు ఓటరు నమోదుపై దృష్టి పెట్టారు. నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు నామినేషన్ల స్వీకరణకు ఇప్పటికే చర్యలు చేపట్టిన అధికారులు ఇంకా మూడు రోజులే నమోదుకు సమయం ఉండటంతో యువతకు అవగాహన కల్పిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల ఆధారంగా ఓటరు నమోదుకు చర్యలు చేపడుతున్నారు. ఈనెల 15 వరకు ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ఈనెల 25న అనుబంధ జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ పూర్తి చేయడంతో పాటు కొత్త ఓటర్ల ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. పూర్తిస్థాయిలో నమోదు కొనసాగించడంతో పాటు ఈనెల 25లోపు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త ఓటర్లకు అవకాశం కల్పించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

పార్లమెంట్ ఎన్నికల కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పార్లమెంట్ పరిధిలోని 1807 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణకు సిద్ధమవుతున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 8న ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఆ జాబితా అనుగుణంగా ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్లు నమోదు చేసుకునేందుకు ఈనెల 15 వరకు అవకాశం కల్పించింది. ఆలోపు బూత్‌స్థాయిలో బీఎల్‌వోలు, తహసీల్దార్లు, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఓటరు జాబితాలో ఇప్పటి వరకు పేరు లేని వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. కొత్త ఓటర్లు నమోదు చేసుకునేందుకు కూడా అవకాశాన్ని ఇచ్చారు. యువ ఓటర్ల ప్రాతినిధ్యం పెంచేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకొని ఈ అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తు చేసుకునేందుకు మరో మూడు రోజులే సమయం ఉంది. సోమవారంలోపు వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలిస్తారు. ఈనెల 25లోపు దరఖాస్తులన్నీ స్ఫుటిని చేసి అర్హులైన వారి అందరికి ఓటు హక్కు కల్పిస్తారు. ఈనెల 25న అనుబంధ జాబితాను ప్రకటించనున్నారు. జాబితాకు అనుగుణంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇప్పటికే పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసిన అధికారులు ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని ఏ రోజుకు ఆరోజు పరిశీలిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికలకంటే ఇప్పటికే 40వేల మంది ఓటర్లు పెరగగా కొత్తగా ఇచ్చిన ఈ గడువు వల్ల మరికొంత మంది ఓటర్లు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఓటరు నమోదుపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఆదేశాలను జారీ చేస్తున్నారు. కొత్త ఓటరు నమోదు సజావుగా జరిగే విధంగా చూస్తున్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితా నమోదుతో పాటు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, ఉద్యోగులకు శిక్షణ వంటి అంశాలను పర్యవేక్షిస్తున్నారు. నామినేషన్లు స్వీకరించిన తర్వాత పూర్తిస్థాయిలో పోలింగ్‌పై దృష్టిపెట్టనున్నారు.



• తెగుళ్లు సోకి ఎండిన వరి పంట

వరి పంటకు తెగుళ్లు

- అయోమయంలో అన్నదాతలు
- ముందుగానే పంటను కోస్తున్న రైతులు

డొంకేశ్వర్, ఏప్రిల్ 12: జిల్లాలో వరి పంటకు తెగుళ్ల సోకడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మొగి పురుగు సోకడంతో దిగుబడిపై రైతులు దిగాలు చెందుతున్నారు. ఈదురుగాలులు, అకాల వర్షాల వల్ల వేసి పంట చేతికి వస్తుందా, రాదోనని ఆందోళన చెందుతున్న రైతులకు మొగి పురుగు ఉధృతితో తలలు పట్టుకుంటున్నారు. వేల రూపాయల్లో ఖర్చు చేసి పురుగుల మందులు పిచికారి చేసినా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి కనపడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డొంకేశ్వర్ మండలంలో యాసంగి సీజన్‌లో రైతులు సుమారు 15వేల పైచిలుకు ఎకరాల్లో వరి వేశారు. అయితే నారు వేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చే సమయం వరకు కష్టాలు కొనసాగుతాయి. పంట చేతికి వచ్చే సరికి పరుగులు మందులను పిచికారి చేయడం తప్పనిసరి. మొదట చలి తీవ్రతతో నారు సరిగ్గా పెరగకపోవడం నుంచి కష్టాలు ప్రారంభమవుతాయి. నాటు వేసిన తర్వాత పైరు ఎదగకపోవడంతో రైతులు పురుగు మందులు, యూరియా వేస్తారు. అంతేగాక వరి పంటకు మొగిపురుగు ఆశించడంతో వరి నాటిన మడులలో రోగం ఆశించిన ఆకులు పడిపోవడంతో రైతులు ఆందోళన కలిగిస్తోంది. మొగి పురుగు నివారించేందుకు వేలల్లో ఖర్చు చేసి రైతులు నాలుగైదు సార్లు పురుగుల మందు పిచికారి చేస్తారు. మొగి పురుగుల రోగం అదుపులోకి వచ్చే సరికి కొన్ని రోజులకు ఆకు ముడత తెగుళ్లు, జింకు లోపంతో వేసి వరిపైరు వేసినట్లు ఉండడంతో వరి ఎదగడానికి రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు మందులను పిచికారీ చేస్తారు. ఇదేగాక పొట్ట దశల్లో వచ్చే సమయంలో పైరుకు పురుగు వల్ల తెల్ల కంకి రావడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. వరి కోతలు మొదల య్యాయి. ప్రారంభం నుంచి రైతుకు ప్రకృతి కంటి మీదకునుకు లేకుండా చేస్తోంది. గాలివానలతో చేతికి వచ్చిన పంట నేలకొరిగి వడ్లు రాలిపోతున్నాయి. మరో పక్క పంట కోసిన రైతులకు వర్షంతో కల్లాలపై వడ్లు తడిసిపోతున్నాయి. ఐదు రోజుల నుంచి వడగళ్ల వానలు ఉండడంతో రైతులు ముందుగానే కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఓ పక్క భూగర్భ జలాలు అడుగంటిపోయి పొట్ట దశలో ఉన్న వరి పంటకు నీరు అందక ఎండిపోయి రైతులు అవస్థలు పడుతున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

దిగుబడి నామమాత్రంగా వచ్చింది..
: పోతూరి శంకర్‌రెడ్డి, రైతు, నూత్‌పల్లి



గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది నామమాత్రంగా దిగుబడి వచ్చింది. వరి పంటకు వేల రూపాయల పెట్టుబడి పెట్టాం. దిగుబడి ఎక్కువ వస్తే లాభదాయకంగా ఉండేది.

వడ్లు రాలిపోతున్నాయి..
: చిన్నారెడ్డి, రైతు, నూత్‌పల్లి



వడగాళ్లతో కోత దశలో ఉన్న వరి పూర్తిగా నేలకొరిగి రాలిపోయి తీవ్రంగా నష్టపోయాం. కల్లాల మీద ఉన్న వడ్లను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం.

నగదు పట్టివేత

• నగరంలో రూ. 7లక్షల 7వేలను సీజ్ చేసిన పోలీసులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 12: నగరంలోని ఎల్లమ్మగుట్టలో శుక్రవారం రాత్రి నగర సీఐ నరహరి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో మొరం దీపక్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న 7లక్షల 7వేల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు సీఐ నరహరి తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు



డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

దీర్ఘకాలిక రుణాల చెల్లింపునకు..
వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ పొడగింపు

● డీసీసీబీ సమావేశంలో నిర్ణయం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 12 : ఉమ్మడి జిల్లాలోని డీసీసీబీ బ్యాంక్ పరిధిలో దీర్ఘకాలిక రుణాల చెల్లింపు కోసం మరోమారు వన్‌టైమ్ సెటిల్ మెంట్ స్కీమ్‌ను పొడిగించామని చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి తెలిపారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. బ్యాంకులో రుణాల వసూలు పూర్తిస్థాయిలో చేసేందుకు ఈ స్కీమ్‌ను ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు పొడగించినట్లు ఆయన తెలిపారు. ఈ దఫానే చివరి అవకాశమని తప్పనిసరిగా రుణాలు చెల్లించాలని ఆయన కోరారు. బ్యాంకు పరిధిలో ఉమ్మడి జిల్లాలో స్వల్పకాలిక రుణాలను వంద శాతం వసూలయ్యాయని ఆయన తెలిపారు. దీర్ఘకాలిక రుణాల వసూళ్లకే ఈ అవకాశాన్ని ఇచ్చామన్నారు. ఈ సమావేశం అనంతరం చైర్మన్‌ను ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు సన్మానించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

● ఏర్గట్లలో ఘటన ● ఒకరికి గాయాలు



ఏర్గట్లలో హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

ఏర్గట్ల, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి బస్టాండ్ వద్ద గల ఓ హోటల్‌లోకి కారు ప్రమాదవశాత్తూ దూసుకెళ్లింది. ఈ ఘటనలో హోటల్ యజమాని ఎనుగందుల రవికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గుమ్మిర్యాల్‌లో నీట మునిగి ఒకరి మృతి

ఏర్గట్ల, ఏప్రిల్ 12: మండలంలోని గుమ్మిర్యాల్ గోదావరి నదిలో నీటి మునిగి లవ్‌ప్రీత్ సింగ్ (19) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. లవ్‌ప్రీత్ సింగ్ హార్వేస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని చెప్పారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైసాకి పండుగ సందర్భంగా..
నిజామాబాద్‌లో ట్రాఫిక్ మళ్లింపు

● పోలీసు కమిషనర్ కల్మేశ్వర్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 12 :

సిక్కు సోదరుల బైసాకి పండుగ శనివారం నిర్వహిస్తున్న సందర్భంగా నిజామాబాదనిజామానినినిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చేసినట్లు పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటలకు ఊరేగింపు పాముల బస్తీ కంఠేశ్వర్ రైల్వేకమాన్ గురుద్వార నుంచి ప్రారంభమై గాజుల్‌పేట్ గురుద్వారా వరకు రాత్రి 10గంటల వరకు చేరుకుంటుందని ఆయన తెలిపారు. రైల్వేకమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీచౌక్, పెద్దబజార్, లక్ష్మిమెడికల్ నుంచి గాజుల్‌పేట్ గురుద్వారాకు చేరుకుంటుందని తెలిపారు. కాబట్టి నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి అత్యవసరంగా ఉన్న ప్రయాణాలను వేరే మార్గాల ద్వారా వెళ్లాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సూచించారు.



పూజలు చేస్తున్న హన్మాన్ భక్తులు

నియమ, నిష్టలతో హన్మాన్ భక్తుల దీక్ష

ధర్పల్లి ఏప్రిల్ 12: నియమ నిష్ఠాలతో హన్మాన్ భక్తులు మండల దీక్షను కొనసాగిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో హన్మాన్ భక్తులు భక్తి శ్రద్ధలతో దీక్షను చేపట్టారు. ఉదయం మూడు గంటలకే నిద్రలేచి స్నానం చేసి పూజలో నిమగ్నమయ్యారు. ఒకే పూట భోజనం చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుంటారు. ఈనెల 23న జరిగే హన్మాన్ జయంతి సందర్భంగా దీక్షను విరమిస్తారు. హన్మన్ భక్తులు కాలినడకన కొండ గట్టుకు వెళ్ళి మాలను విరమిస్తారు. ప్రతీరోజు నియమ నిష్ఠాలతో పూజలను కొనసాగిస్తామని గురుస్వాములు కమ్మరి గంగాధర్, రెబ్బ నరేష్‌లు తెలిపారు. ఈనెల 17న జరిగే శ్రీరామ నవమికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. రామ నవమి సందర్భంగా సీతరాముల కళ్యాణోత్సవం భక్తులు తరలి రావాలని కోరారు.

నేటి నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 12: మండలంలోని తొర్లికొండ గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ జాతర ఉత్సవాలు శనివారం నుంచి 18 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం జరుగుతాయని, 16న స్వామివారి కల్యాణోత్సవం, 17న స్వామివారి రథోత్సవం, 18న చక్రతీర్థం, స్వామివారి నాగవెల్లి కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు తెలిపారు.

6వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం

ముప్కాల్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని కస్తూర్బగాంధీ బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.వినోద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పాఠశాలలో దరఖాస్తులు చేసుకునే వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, బోనఫైడ్, కుల, ఆదాయ, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలతో పాటు ఫోటోలతో సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్12: మున్సిపల్ పరిధిలోని శనివారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీధర్ తెలిపారు. 33కేవీ ఆర్మూర్ లైన్ దగ్గర ఉన్న చెట్ల కొమ్మల నరికివేత, ఇతర లైన్ మెయింటెనెన్స్ కారణంగా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లాడిచ్‌పల్లి, డిచ్‌పల్లి రైల్వేస్టేషన్, దూస్గాం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో చెట్ల కొమ్మలు తొలగించనున్న కారణంగా ఈనెల 13న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ శ్రీనివాస్, ఏఈ సాయిలు తెలిపారు. వినియోగదారులు, రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సహకరించాలని కోరారు.



మోర్తాడ్‌లో రైతుల పాడి పశువులు

రైతులు పాడి పశువుల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి : పశు వైద్యాధికారి

మోర్తాడ్, ఏప్రిల్ 4: అధిక పాలు దిగుబడులు పొందడానికి అధిక పాలధార కలిగిన పాడి పశువులను ఎంపిక చేసుకొని పెంచడం ఎంతో అవసరమని, పాడి పశువుల్ని ఎంపిక చేసుకునే ముందు కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలని మండల పశువైద్యాధికారి గౌతంరాజ్ తెలిపారు. వాతావరణం, పరిస్థితులు పాలకి మార్కెట్‌లో ఉన్న గిరాకి, పశుగ్రాసాన్ని దృష్టిలో ఉంచుకొని సరైన ఎంపిక చేసుకోవాలని అధికంగా పాలనిచ్చే జెర్సీ సంకర జాతి ఆవులను ఎంపిక చేసుకోవాలని, దేశీవాలి, ఆవు జాతులలో ఒంగోలు, సింధి, గిర్ జాతులను ఎంపిక చేసుకోవాలి. గేదేల్లో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ముర్రా జాతిగేదే శ్రేష్ఠమైనది. అధిక పాల దిగుబడికి, అత్యధిక వెన్న శాతానికి పెట్టింది పేరు. జన్యు శాస్త్ర రీత్యా అధిక పాలను ఉత్పత్తి చేసే శక్తి పాడి పశువుల్లో ఉంటుంది. జన్యు కాణాలు లేని పశువులను ఎంత మెపినా పాల దిగుబడి అంతం మాత్రంగానే ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న పాడి పశువులను మాత్రంమే ఎంపిక చేసుకోవాలని పశువుల ఎంపిక జరుగుతున్నప్పుడే అది సక్రమంగా ఎదకు వస్తుందా? తెలుసుకోవాలి. పాడి ద్వారా ఎక్కువ ఆదాయం రావాలంటే ప్రతీ 14-15 నెలకు ఒకసారి ఈనెటట్లుండాలి. గాలికుంటు వ్యాధి సోకకుండా చూడాలి. దీంతో పాల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఒకటి, రెండు ఈతల్లోనివి లెగ దూడతో సహ ఈనిన రెండు వారాల్లోగా కొనడం మంచిది. కనీసం రోజుకు 12-15లీటర్ల దిగుబడి ఇచ్చే పశువుని, రెండు పూటలా పాలను ఇచ్చేవి ఎంపిక చేసుకోవాలి. ఎక్కువ వయస్సు ఉన్న ఆవులను, గేదేలను ఎంపిక చేసుకోకూడదు. దంతాలను బట్టి పశువుల వయస్సును అంచనా వేయాలి. రెండు నుంచి ఆరు దంతాలున్న పశువులను ఎంపిక చేసుకోవాలి. అప్పుడే వాటి జీవితకాంలో ఎక్కువ ఈతలు పొందే అవకాశం ఉంది. చూడి పశువులను కొనకూడదు. ఆరోగ్యంగా చురుకుగా ఆడ లక్షణాలు, శాంత స్వభావం ఉన్న పశువులను ఎంపిక చేయాలి. కళ్లు పెద్దగా మెరుస్తూ ఉండాలి. శరీర బాగాలు పూర్తిగా వృద్ధి చెంది ఉండాలి. పాడి పశువులను ముందు నుంచి పక్క నుంచి వెనుక నుంచి చూసినప్పుడు త్రికోణాకారంగా ఉండాలి. ఇలాంటివి అధిక ఉత్పాదక సామర్థ్యం కలిగి ఉంటుంది. పాడి ఎంపికలో పొదుగుకు చాలా ప్రాముఖ్యత ఉంది. పొదుగుపై నాలుగు రొమ్ములు ఒకే పరిమాణంలో ఉండాలి. చన్నులు మరీ పొట్టిగా, మళ్లీ పొడవుగా ఉండకూడదు. రైతులు ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటే అధిక పాల దిగుబడి ఎక్కువగా ఉంటుందని ఆయన వివరించారు.

ఓటు ఆవశ్యకతపై ముగ్గుల పోటీలు

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్12: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం ఓటు ఆవశ్యకతపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ గ్రూప్ మహిళలతో ఓటు ఆవశ్యకతపై పోటీలు నిర్వహించి ఉత్తమ ముగ్గులు వేసిన వారికి కమిషనర్ రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, సీవో రాజలింగం, ఆర్‌పీలు అన్నపూర్ణ, సత్య, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

ఏర్గట్ల, ఏప్రిల్ 12: మండల పరిధి పోలీస్ స్టేషన్‌లో వాహనాల తనిఖీలో భాగంగా మద్యం తాగి వాహనాలు నడిపిన ఏర్గట్లకు చెందిన కోల రాజేష్ గౌడ్, నిర్మల్‌కు చెందిన బోదన్‌కడ్ శ్రీనివాస్‌లకు రెండు రోజుల జైలు శిక్షను ఆర్మూర్ కోర్టు విధించినట్లు ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. అలాగే రెండవ సారి మద్యం సేవించిన బట్టాపూర్‌కు చెందిన భూషనవేణి నర్సయ్య, మెట్‌పల్లికి చెందిన విజయ్ దేష్ముక్‌లకు 10 వేల రూపాయల జరిమానాను విధించినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

3వ వార్డులో క్రికెట్ కిట్ల పంపిణీ

ఆర్మూర్ టౌన్ , ఏప్రిల్ 12: మున్సిపల్ పరిధిలోని హౌజింగ్‌బోర్డు 3వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్, కౌన్సిలర్ వరలక్ష్మీ లింబాద్రిగౌడ్‌లు శుక్రవారం క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ కిట్‌లు పంపిణీ చేశారు. హౌజింగ్ బోర్డులోని కింగ్స్ యూత్, శ్రీవిష్ణుయూత్ సభ్యులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి సాల ప్రసాద్, యువకులు పాల్గొన్నారు.

అటకెక్కిన వ్యవసాయ యంత్రాలపై రాయితీ

● జిల్లాలలో రైతులకు అందని సబ్సిడీ వ్యవసాయ రంగ యంత్రాలు, పరికరాలు ● కొన్నేళ్లుగా సబ్సిడీకి దూరమవుతున్న రైతులు ● రైతులకు భారంగా మారిన వ్యవసాయం

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 12: అన్ని రంగాలలో మార్పులు వచ్చిన విధంగానే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వ్యవసాయంలో రైతులకు సబ్సిడీపై గతంలో అనేక పరికరాలు, యంత్రాలు అందజేసేవారు. దీంతో రైతులు ఎంతో సంతోషించారు. ఆ సంతోషం కాస్త మున్నాళ్లముచ్చటే అయ్యింది. ఆధునిక వ్యవసాయంలో యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ రంగానికి మంచి రోజులు వచ్చాయని రైతులు మురిసిపోయారు. కానీ గత కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి యంత్రాలు, పరికరాలు అందజేయడంలేదు. సబ్సిడీపై యంత్రాలు అందజేస్తే వ్యవసాయంలో రైతులకు ఎంతగానో ప్రయోజకరంగా ఉంటుంది. యంత్రాల వినియోగంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు, తక్కువ సమయంలో పనులు పూర్తి అవ్వడమే గాకుండా వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. గతంతో వ్యవసాయానికి సబ్సిడీ యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేసింది. రోటోవేటర్‌పై 50శాతం సబ్సిడీ, పిచికారి పరికరాలు 33 శాతం సబ్సిడీతో రైతులకు అందజేసేవారు. 2018 వరకు సబ్సిడీ కొనసాగింది. కొంత కాలంగా ఈ పథకం అటకెక్కింది. వ్యవసాయానికి ఏ పరికరం కూడా సబ్సిడీపై జిల్లాలోని రైతులకు అందడం లేదు. గతంలో కూరగాయ విత్తనాలతో పాటు ట్రాక్టర్‌లు, స్ప్రే పంపులు, కలుపుతీసే యంత్రాలు, వరి కోత మిషన్‌లు, టార్పలిన్ కవర్‌లు సబ్సిడీపై ఇచ్చేవారు..



యంత్రం సాయంతో ఎర్రజొన్న పంట కోపిస్తున్న రైతులు

● కూలీల కొరతను అధిగమించవచ్చు

వ్యవసాయ పనుల్లో యంత్రాలు వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసే వీలుంటుంది. విత్తనాలు వేయడం మొదలు నుంచి పంట కోత వరకు అన్ని పనులు యంత్రాల వల్ల చేయడంతో సమయం ఆదా అవుతుంది. అంతేగాక కూలీల కొరతను అధిగమించవచ్చు. గ్రామాలలో వ్యవసాయ పనులకు కూలీలు లభించక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అందుబాటులో ఉన్న కొద్ది మంది పనులకు వచ్చిన డిమాండ్ ఉండడంతో కూలీల చెల్లింపులో రైతులపై అధిక భారం పడుతుంది. ఇప్పటికే రైతులు యంత్రీకరణపై ఆధారపడి ఉన్నారు. వరి పంటకు చేతికొచ్చే సమయంలో కూలీలు లభించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరి కోత యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు భారమవుతుంది. వరి కోత యంత్రాలు అద్దెకు తీసుకొని పనులు వెల్లదీస్తున్నారు. ప్రభుత్వం యంత్ర పరికరాలు, వరికోత యంత్రాలను సబ్సిడీపై అందిస్తే రైతుల ఇబ్బందులు దూరమవుతాయి అంటున్నారు.

● అందుబాటులో లేని వరినాటు యంత్రాలు

రైతులకు వరినాట్లు వేసే యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కూలీలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రామాల్లో సైతం పొలం పనులకు కూలీలు లభించక వరినాట్లు వేసే పనులకు ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలే ఆసరా అవుతున్నారు. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలచే రైతులు నాట్లు వేయిస్తున్నారు. వరినాట్లు యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకంగా ఉంటుంది.

● రైతులకు పెట్టుబడి ఆదాకు అవకాశం

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందజేస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి డబ్బులు ఆదా అవుతాయి. రోటోవేటర్ లాంటి పరికరాల వినియోగంతో భూమి గుల్లాగా మారి సారవంతమవుతుంది. పిచికారి పరికరాలు (స్ప్రే) పంపులు రాయితీ ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుంది. సీడ్‌కం ఫర్టిలైజర్, డ్రీల్ వినియోగం ద్వారా విత్తనమోతాదు, ఎరువులు మోతాదు ఆదా అయి రైతులకు బహువిధ లాభాలు చేకూరుతాయి. దీని వల్ల వ్యవసాయ పెట్టుబడి ఖర్చు తగ్గించి.. రైతులకు నికర ఆదాయం పెంచడానికి వీలు కలుగుతుంది.







వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కొన్ని యంత్ర పరికరాలు

మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

● జిల్లా ఆరోగ్య విద్య బోధకులు, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు

ఆర్మూర్ టౌన్ ఏప్రిల్ 12: పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్ అండ్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య విద్య బోధకులు, జిల్లా కోఆర్డినేటర్ మాన్పూర్ వెంకటేశ్వర్‌లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అనేక రకాలైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, నాలుగు రకాలుగా మానసిక ఒత్తిడిలు ఉంటాయన్నారు. మానసికంగా బలహీనులైన కొందరు క్షణికావేశంలో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని, స్థానికుల దృకృథంతో చక్కని ప్రణాళికతో మానసిక ధైర్యంతో ప్రతీరోజు చదువుకుంటూ తనపై తనకు నమ్మకం పెంచుకున్నప్పుడు ఒత్తిడికి గురికాకుండా అనుకూన్న లక్ష్యంకు చేరుకుంటారని, శరీరక వ్యాయం, అటలు, మెడిటేషన్ చేస్తూ మానసిక ప్రశాంతతను పొందాలన్నారు. ఇందులో ఇన్‌చార్జీ వైస్ ప్రిన్సిపాల్ భువనేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఉపాధ్యాయులు స్వప్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ మాన్పూర్ వెంకటేశ్వర్లు

గురుకుల డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో మానసిక ఒత్తిడి ఉపశమనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కాకుండా వ్యయామం, ధ్యానం చేస్తూ పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలని, నీరు తాగడం వల్ల ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ హెల్త్ ఎడ్యుకేటర్ జి.స్వామిసులోచన, మానసిక వైద్యుడు రంజిత్, అనురాధ, ప్రిన్సిపాల్ ధణవేణి, సంతోషి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలి

● రైతాంగానికి మద్దతు ధర చెల్లించాలి : దినేష్‌కుమార్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 12: జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరిస్తున్న వరిధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం చేయకుండా కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో ఛాయ్‌పై చర్చ కార్యక్రమంలో భాగంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు ఆరబోసుకున్న వరిధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు ప్రస్తుతం అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోకుండా ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మిట్టపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి కూలీ వందరోజుల పని పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. కూలీలు చేస్తున్న పనుల వివరాలు, కూలీ డబ్బుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కూడా కొనుగోళ్లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ గద్దెభూమన్న, మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి వెంకటరమణ, పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శివారెడ్డి, లక్ష్మణ్, శ్రీను, ప్రదీప్, విఠల్, అబ్బులు, బాలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



మిట్టపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న దినేష్‌కుమార్



ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో వరిధాన్యం పరిశీలిస్తూ..

కాంగ్రెస్ పార్టీలోకి తెలంగాణ జాన జాగృతి సమితి పార్టీ వ్యవస్థాపకుడు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 12: తెలంగాణ జాన జాగృతి సమితి పార్టీ వ్యవస్థాపకుడు సుంకె శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ జనజాగృతి సమితి పార్టీని త్వరలోనే హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తామని సుంకె శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, మంతెన శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి కండువా వేసి ఆహ్వానిస్తున్న దృశ్యం



రైతులతో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి

'వేసవిలో పశువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి'

మాక్లూర్ , ఏప్రిల్ 12: వేసవిలో రైతులు పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీంతో పశువులు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గుంజలి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోదక టీకాలు వేశారు. గ్రామంలో జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువులకు ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పిస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు. మొత్తం 344 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశామని తెలిపారు. ఇందులో పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే, పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా స్రవంతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 12: డిచ్‌పల్లి మండల మహిళామోర్చ అధ్యక్షురాలిగా యానంపల్లికి చెందిన స్రవంతిని శుక్రవారం నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు దినేష్‌కుమార్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను మండల మహిళలకు వివరించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గెలుపు కోసం తప్పక సహకారం అందిస్తానని స్రవంతి పేర్కొన్నారు. ఇందులో జిల్లా పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, మండల అధ్యక్షుడు వెంకటరమణ, పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 19మందికి జైలు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 12: ఆర్మూర్ సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 244 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో శుక్రవారం ఆర్మూర్ కోర్టు ఇన్‌చార్జీ న్యాయమూర్తి 19మందికి జైలు శిక్ష విధించినట్టు ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఈ కేసులో మిగతా వారికి రూ.4లక్షల 43వేలు జరిమానా విధించారన్నారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 34కేసులకు గాను నలుగురికి జైలు శిక్ష మిగత వారికి రూ.67వేల 500జరిమానా, బాల్కొండ పరిధిలో 21కేసులో రూ.41వేల 500 జరిమానా, నందిపేట పరిధిలో 21కేసులో రూ.38వేల 500 జరిమానా, వేల్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 18 కేసులలో రూ.38 వేల జరిమానా, మెండోరలో 29 కేసులలో ఐదుగురికి జైలు శిక్ష, మిగతా వారికి రూ.68వేల జరిమానా, ముప్కాల్‌లో 11కేసులలో ఒకరికి జైలు శిక్ష మిగతా వారికి రూ.23వేల 500జరిమానా, భీమ్‌గల్‌లో 26కేసులకు గాను ముగ్గురికి జైలు శిక్ష, రూ.44వేల జరిమానా, కమ్మర్‌పల్లి పరిధిలో 28 కేసులకు గాను నలుగురికి జైలు శిక్ష మిగతా వారికి రూ.45వేల 500 జరిమానా, ఏర్గట్ల పరిధిలో 31 కేసులకు గాను ఇద్దరికి జైలు శిక్ష మిగతా వారికి రూ.55 వేల జరిమానా, మోర్తాడ్ పరిధిలో 25 కేసులకు గాను రూ.29 వేల 500జరిమానా విధించినట్టు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు.

కమ్మర్‌పల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆర్మూర్ ఇన్‌చార్జ్ న్యాయవాది శుక్రవారం నలుగురికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కమ్మర్‌పల్లికి చెందిన నలుగురువ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపర్చగా.. ఈ శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

కలిగోట్‌లో చెరువులో పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 12: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన పుసవెర్ల శేఖర్(32) చెరువులో పడి మృతి చెందినట్టు ఎస్సై సిహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై సిహెచ్.తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కలిగోట్ గ్రామానికి చెందిన పుసవర్ల శేఖర్ గురువారం మధ్యాహ్నం గ్రామంలోని కుమ్మరికుంట చెరువులోకి వెళ్లి చేపలు పడుతుండగా.. చెరువులో ఉన్న వలకు ప్రమాదవశాత్తు చిక్కుకొని చెరువలో మునిగిపోయాడని ఎస్సై తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం చెరువులో మృతదేహం తేలగా శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతుడు కూలీ పనులు చేసుకుంటాడని ఎస్సై తెలిపారు. మృతుడు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



మాన్‌సింగ్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన సిరికొండ జడ్పీటీసీ

సిరికొండ, ఏప్రిల్ 12: బీఆర్‌ఎస్‌కు చెందిన సిరికొండ జడ్పీటీసీ సభ్యుడు మాలవత్ మాన్‌సింగ్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాన్‌సింగ్‌కు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పాకాలకు చెందిన బంజార సేవ సంఘం మాజీ అధ్యక్షుడు బాలకిషన్ నాయక్ కూడ కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

హనుమాన్ స్వాముల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న హనుమాన్ స్వాములు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 12: అర్సపల్లి రైల్వేగేట్ వద్ద హనుమాన్ మాలలో ఉన్న నరేష్ అనే స్వామిపై అకారణంగా దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ అఖిల భారత హనుమాన్ దీక్ష ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద రాస్తారోకో చేశారు. గురువారం రాత్రి కొంత మంది నరేష్ స్వామిపై అకారణంగా దాడి చేశారని హనుమాన్ స్వామి మాలలో ఉన్న అతనిపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, శ్రీశైలం, సతీష్, సృజన్, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత భోజనం



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 12: నగరంలోని ఖలీల్‌వాడిలోగల జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ధన్‌పాల్ లక్ష్మీబాయి-విఠల్‌గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నిధులు, నీళ్లు, నియామకాల నినాదంతో అని నిరుద్యోగులు అంతా ఏకమై ఆనాడు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపించి ఎంతో మంది ఆత్మహత్యలకు కారణమైందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్నికల కోడ్ ముగియగానే నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు తన ట్రస్ట్ ద్వారా సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నామని నిరుద్యోగులు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని దేశానికి, జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. నిరుద్యోగుల కోసం తన వంతుగా ఆరు నెలలకోసారి బిగ్ జాబ్‌మేళా నిర్వహిస్తామని వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా గ్రంథాలయంలో కూలర్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరగా అధికారులు కూలర్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట నాయకులు లక్ష్మీనారాయణ, మమత ప్రభాకర్, పవన్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించాలి : సీపీఎం

పెద్దబజార్, ఏప్రిల్ 12: మతోన్మాదాన్ని ఎదురించి రాజ్యాంగాన్ని రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో వామపక్షాల పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్యాన్ని చేసే పద్ధతిలో బీజేపీ కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్‌టెక్స్ తదితర సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాల గొంతు నొక్కడంతో పాటు ప్రజల్లో మత విద్వేశాలను రగిలించి తిరిగి మూడోసారి అధికారంలోకి తామే వస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీజేపీకి 370కిపైగా స్థానాలు సాధించడంతో పాటు ఎన్‌డీఏకు 400లకు పైగా స్థానాలు వస్తాయని అన్నారు. ఈనెల 18న జరిగే ప్రెస్‌క్లబ్‌లో జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు సుధాకర్, వనమాల కృష్ణ, శివకుమార్, శ్రీనివాస్, గంగాధర్, ఓమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు రూ.25వేల పరిహారం చెల్లించాలి

- ప్రత్యేక పరిస్థితుల కింద ప్రభుత్వం సాయం అందించాలి
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



టాక్లీ శివారులో వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం

కోటగిరి, ఏప్రిల్ 12: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతి కొచ్చే సమయంలో అకాల వర్షంలో రైతులు నష్టపోయారని, వెంటనే వారికి ప్రత్యేక పరిస్థితుల కింద ఎకరానికి 25వేల రూపాయలు అందించి ఆదుకోవాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. పొతంగల్ మండలంలోని టాక్లీ, సోంపూర్ గ్రామాలలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈదురు గాలులు, వడగండ్ల వానతో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. వడగండ్ల వానతో నూటికి 90శాతం పంట నేల రాలిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పంట దెబ్బతిన్న రైతులను ఓదార్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఎకరానికి 50బస్తాలు పండే వారి వడగండ్ల వానతో నేల రాలిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు ప్రాథమిక సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. రైతుల వారిగా వ్యక్తిగత సర్వే నిర్వహించి పంట నష్టం అంచన వేయాలని ఆయన అధికారులను కోరారు. మానవతదృక్పదంతో ఎకరానికి 25వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో వైపు పొద్దు తిరుగుడు పంటను తక్షణమే కొనుగోలు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఫోన్‌లో కోరారు. గ్రామాల వారిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పొద్దుతిరుగుడు కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, జడ్పీటీసీ శంకర్ పటేల్,



టాక్లీలో రైతులతో మాట్లాడుతున్న పోచారం

జడ్పీ కోఆప్షన్ మెంబర్ సిరాజ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఏజాజ్ ఖాన్, నాయకులు చాకూర్ గంగాధర్, నాగరాజు గౌడ్, కారేగాం శివరాజ్, హరి, దిగంబర్, మున్నీ, పత్తి లక్ష్మణ్, కూచి సిద్దు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట చేజారి పోవడం బాధాకరం..

వర్ని: అకాల వర్షాలు, వడగండ్ల వల్ల దెబ్బతిన్న రైతుల పంటలను చూస్తుంటే గుండె కరిగిపోతుందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం చందూర్ మండలంలోని లక్ష్మి సాగర్ తండా, మేడిపల్లి, చందూర్, లక్ష్మాపూర్ గ్రామాల శివారులో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. చేతికొచ్చిన పంట చేజారి పోవడం బాధాకరమని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా నష్టం వాటిల్లిన అన్నదాతలకు ఎకరాకు రూ.25వేలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ బాధ్యులు పోచారం సురేందర్ రెడ్డి, విండో చైర్మన్ అశోక్, రైతులు ఉన్నారు.



భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బోధన్ రూరల్, ఏప్రిల్ 12: గిరిజనుల ఆరాధ్య దైవం తపస్వీ రామారావు మహరాజ్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో శ్రీ రామారావు మహరాజ్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాందేవ్, కార్యదర్శి రవిదాస్ నాయక్, గ్రామ పెద్దలు మోహన్ నాయక్, విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అదుపులో నిందితులు

నవీపేట, ఏప్రిల్ 12: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని భరత్ నగర్ తండా సమీపంలో అలీసాగర్ కాలువలో గురువారం మహిళ మృతదేహం లభ్యం కాగా సంబంధిత మహిళ హత్యకు గురైందని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలు రెంజల్ మండలం బోర్గాంకు చెందిన చంద్రకళ(46)గా ఈపాటికే పోలీసులు గుర్తించారు. సంబంధిత మహిళ అదే గ్రామానికి చెందిన వారికి 50 వేల రూపాయలు అప్పుగా ఇచ్చిందని, ఇటీవల సంబంధిత డబ్బులను ఆమె ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో అదే గ్రామానికి చెందిన ఇద్దరు నమ్మించి పదునైన ఆయుధంతో తలపై దాడి చేయడంతో ఆమె మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయంపై పోలీసులు బోర్గాంకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

నవీపేట, ఏప్రిల్ 12: మండలంలోని పొతంగల్‌లో శుక్రవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌ను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్‌కే.బాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువ, పూలమాలలతో సన్మానించారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జరిగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని తాహెర్‌బిన్ హందాన్ సూచించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, నరేష్ గౌడ్ తదితరులున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం..

నిజామాబాద్ అర్బన్: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఏబీవీపీ పూర్వ సంయుక్త కార్యదర్శి జగన్మోహన్‌గౌడ్, ఏబీవీపీ పూర్వ కార్యకర్త పిల్లిశ్రీకాంత్‌లను శుక్రవారం ఏబీవీపీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఏబీవీపీలో పనిచేసిన జగన్మోహన్‌గౌడ్, పిల్లిశ్రీకాంత్‌లు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందడం గొప్ప విషయమని ప్రాంత సంఘటన కార్యదర్శి కరుణాకర్, పూర్వ రాష్ట్ర అధ్యక్షులు నరేష్ తదితరులు అన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, సూర్యకుమార్, శంకర్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

నవీపేట, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు స్థానిక రఘుపతి రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించే ఈ సమావేశానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టీ.జీవన్ రెడ్డి హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.

రెండోరోజూ కొనసాగిన ఉత్సవాలు

నవీపేట, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో నూతనంగా పునర్ నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం రెండో రోజు ఉత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా రెండో రోజైన శుక్రవారం మూలమంత్ర హవనం, జలాధివాసం, ధాన్యాధివాసం, ఫలాదివాసము, పుష్పాదివాసము, శయానాదివాసము నిర్వహించారు. చివరి రోజైన శనివారం యంత్ర, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. శనివారం జరిగే ఉత్సవాలకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హజరుకానున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'అనారోగ్య కారణాలతో తప్పుకున్న'

సిరికొండ, ఏప్రిల్ 12: తనకున్న ఆరోగ్య సమస్యల వల్లే తాను ప్రిన్స్‌పాల్‌గా తప్పుకున్నట్లు మాడల్ స్కూల్ మాజీ ప్రిన్స్‌పాల్ సునీత తెలిపారు. తాను పాఠశాల అభివృద్ధి కోసమే పనిచేశానని తాను ఎవరినీ ఇబ్బంది పెట్టలేదన్నారు. తాను ప్రిన్స్‌పాల్‌గా బాధ్యతలు నిర్వర్తించ లేనని, అనారోగ్యంగా ఉన్నందున విధుల నుంచి తప్పించాలని తాను విద్యాశాఖను వినతి పత్రాన్ని ఇచ్చినందున బాధ్యతల నుంచి విముక్తి కల్గించారని సునీత తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

ఎడపల్లి, ఏప్రిల్ 12: మండలానికి చెందిన ఓ బాలికను మోసం చేసిన కేసులో యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. యువకుడికి ఇది వరకే పెళ్లి అయి ఇద్దరు పిల్లలు ఉండగా, బాలికను మోసం చేసి పెళ్లి చేసుకోవడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

నవీపేట మండలంలో వర్షం

నవీపేట, ఏప్రిల్ 12: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం రాత్రి తేలికపాటి వర్షం కురిసింది. ఉరుములు, మెరుములతో వర్షం కురియడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాలలోని కల్లాలు రోడ్లపై ధాన్యం రాసులు ఉండటంతో పాటు పలు చోట్ల కోతకు వచ్చిన వరిపంట ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

'పోరాటాలకు సిద్ధం కావాలి'

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 12: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఏర్పాటుచేసిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చి విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేట్, కార్పొరేట్‌కు అప్పజెప్పాలనే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

'రైతులకు కష్టాలు తెచ్చిపెట్టిన 22వ ప్యాకేజీ పనులు'



అసంపూర్తిగా ఉన్న పనులను చూపుతున్న రైతులు

సదాశివనగర్, ఏప్రిల్ 12: రైతులకు ఆశలు రేకెత్తించిన బొంపల్లి రిజర్వాయర్ 22వ ప్యాకేజీ పనులు పూర్తిచేయకపోవడంతో అనేక కష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కాలువ నిర్మాణంతో ఏర్పడిన ఇబ్బందులపై రైతులు క్షేత్రస్థాయిలోకి పరిశీలించడంతో పాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొంపల్లి నుంచి వెళ్లే ఫార్మేషన్ రోడ్డు వందలాది మంది రైతులకు పంట పొలాలకు వెళ్లడానికి వీలుగా ఉండేదని, బొంపల్లి రిజర్వాయర్ అలుగు నిర్మాణం చేపట్టడం మధ్యలోనే వదిలేయడంతో అలుగునీరు పంటచేన్లకు నష్టం చేస్తూ వెళ్తోందని రైతులు వాపోయారు. 2019లో భూసేకరణ నిర్వహించినప్పటికి ఇంతవరకు పనులు పూర్తి చేయకపోవడంతో అలుగునీరు తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు ఏమైనా వస్తువులు, ఎరువులు తీసుకెళ్లాలంటే మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కలెక్టర్ కాలువను సత్వరమే పరిశీలించి రోడ్డును సరిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



మున్నూరు కాపు భవనంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మున్నూరు కాపు సంఘ భవనం ప్రారంభం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 12: బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో మున్నూరు కాపు తర్వా సంఘ భవనం శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా రాకాసిపేట కుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఏశాల రవి, చిన్న పోశెట్టిలు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో మాజీ ఎమ్మెల్యే షకీల్ 5లక్షల రూపాయల నిధులు ఇచ్చారని దాంతో పాటు ఈ తర్వాకు చెందిన 67కుటుంబాలు కలిసి మరికొన్ని డబ్బులు వేసుకుని సంఘ భవన నిర్మాణాన్ని పూర్తి చేసుకుని శుక్రవారం ప్రత్యేక పూజలతో కుల సంఘ సభ్యుల సమక్షంలో ప్రారంభించుకున్నామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారం అవసరం ఉందని ఎమ్మెల్యే సైతం తమ సంఘ భవనానికి మరిన్ని నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, సీపీఎం అసెంబ్లీ ఇన్‌చార్జి ఏశాల గంగాధర్, ఉద్మీర్ గల్లీ మున్నూరు కాపు సంఘం నాయకులు ఉద్మీర్ సాయిలు, బండారి ముత్తయ్య, గంగాధర్, కమ్మ సంఘం నాయకులు మండవ శ్రీనివాస్, కమ్మ రాజు, ప్రవీణ్, ఏశాల చంద్రశేఖర్, ఏశాల రాజు, ఏశాల రత్నకర్, సునీల్, సాయిలు, గంగాధర్, ఒడ్డెన్న, సత్యనారాయణ, పెద్ద లక్ష్మణ్‌లతో కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా మక్కయ్య



ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధికి నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

కోటగిరి, ఏప్రిల్ 12: బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా శ్రీగంధం మక్కయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ హైదరాబాద్‌లో శుక్రవారం మక్కయ్యకు నియామక పత్రం అందజేశారు. బీజేపీ అగ్ర నాయకత్వం తనపై ఎంతో నమ్మకంతో అధికార ప్రతినిధిగా నియమించారని మక్కయ్య పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి దివాకర్, స్వామి యాదవ్, నాగం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం సెంటర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 12: ఏటీఎం సెంటర్ల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఏటీఎం కార్డులు ఇవ్వవద్దని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. శుక్రవారం బోధన్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అనిల్ టాకీస్ చౌరస్తాలో ఎస్‌బీఐ బ్యాంకు వద్ద గల ఏటీఎం సెంటర్‌కు వెళ్లి ఏటీఎం పిన్ జనరేట్ చేస్తుండటంతో అపరిచిత వ్యక్తి తాను చేయిస్తానని అతని ఏటీఎం కార్డు తీసుకుని అదే బ్యాంకు సంబంధించిన వేరే ఏటీఎం కార్డు ఇచ్చి పంపించాడని పేర్కొన్నారు. తిరిగి అతను బాధితుడి ఏటీఎం కార్డు నుండి 30వేల నగదును డ్రా చేశాడన్నాడు. అతని ఫోన్‌కు మెసెజ్‌లు రావడంతో అప్రమత్తమైన బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. బాధితుడు షేక్.అబ్రార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏటీఎం సెంటర్ల వద్ద అపరిచిత వ్యక్తులను నమ్మవద్దన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయని, సీసీ పుటేజీల ద్వారా నేరస్థులను గుర్తించి నగదు రికవరీతో పాటు జైలుకు పంపించడం జరిగిందన్నారు. బాధితుడి ఫిర్యాదును సిరియస్‌గా తీసుకుని 24గంటల్లో మోసం చేసిన వ్యక్తిని పట్టుకుంటామన్నారు.

జన్నేపల్లిలో ఒకరి హత్య

నవీపేట, ఏప్రిల్ 12: మండలంలోని జన్నేపల్లికి చెందిన మక్కల సాయిలు(45)అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జన్నేపల్లికి చెందిన మక్కల సాయిలు శుక్రవారం తెల్లవారుజాము. మృతి చెందాడు. అతడి మెడపైన గాయాలు ఉండటంతో మృతుడి తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సాయిలు మెడపై గాయాలు ఉన్నాయని వైద్యులు పేర్కొనడంతో శుక్రవారం రాత్రి నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ కుమార్, నవీపేట ఎస్ఐ యాదగిరి గౌడ్ జన్నేపల్లిలో మృతుడి కుటుంబ సభ్యులను విచారించారు. ఈ విచారణలో భార్య రేఖ, మరి కొందరు కుటుంబ సభ్యులతో కలిసి సాయిలు గొంతుకు ఉరి వేసి హత్య చేసినట్లు తెలిసింది. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవీపేట,ఏప్రిల్12: మండలంలోని బినోల శివారులో గురువారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందని ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. మండలంలోని నాళేశ్వర్ నుంచి బినోలకు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సంబంధిత ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు 10వేల రూపాయల చొప్పున సంబంధిత యాజమానులకు తహసీల్దార్ నారాయణ జరిమానా విధించడం జరిగిందని ఎస్సై వివరించారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.300	రూ. 320
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.305	రూ. 325

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75,500	రూ.69,400	రూ.870

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మైదాన్ (హిందీ) (9.15)
: ఫ్యామిలీ స్టార్ (1.05, 10.30)
: టిల్లు స్క్వేర్ (4.30, 7.30)

స్క్రీన్-2 : బడే మియాన్ చోటే మియాన్ (తెలుగు) (10.00, 7.05)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.30)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.35)

స్క్రీన్-3 : లవ్‌గురూ (1.10, 7.15), డియర్ (4.20)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (10.25)

స్క్రీన్-4 : మైదాన్ (హిందీ) (12.00)
: మంజుమ్మల్ బాయ్స్ (3.50, 6.35)
: లవ్ గురూ (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గీతాంజలి మళ్లీ వచ్చింది (10.40)
: టిల్లు స్క్వేర్ (1.30)
: ఫ్యామిలీ స్టార్ (4.20, 7.30)

స్క్రీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (11.00)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (1.30, 7.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (4.30, 10.25)

స్క్రీన్-3 : డియర్ (10.30)
: మంజుమ్మల్ బాయ్స్ (1.45, 4.45, 10.45)
: మైదాన్ (హిందీ) (7.20)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితమహల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)

నటరాజ్ : బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (11.00, 6.00)
: మైదాన్ (హిందీ) (2.00, 9.00)

విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)

\- నిజామాబాద్ అర్బన్